# రాంగ్ నెంబర్

-మల్లాది వెంకట కృష్ణమూర్తి

**మా** పై ఫ్లాట్‌ని నలుగురు అమ్మాయిలు కలిసి అద్దెకి తీసుకుని ఉంటున్నారు. వాళ్లంతా కేరళ రాష్ట్రీయులు. మా కాలనీలోని ఓ పెద్ద హాస్పటల్‌లో వాళ్ళంతా నర్సులుగా పనిచేస్తున్నారు. నర్సులు తొడుక్కొనే తెల్లటి గౌనుల్లో వాళ్ల వంపు సొంపులు స్పష్టంగా కనిపించేవి.

వాళ్ల ఫ్లాట్‌కి తరచు అనేక మంది అబ్బాయిలు వచ్చి వెళ్తూండేవారు. వారంతా మళయాళీలే. ఫ్లాట్ యజమానికీ విషయం తెలిసి అడిగితే, 'వాళ్ళంతా హైద్రాబాదులో ఉండే మళయాళీలు. ఒంటరి ఆడపిల్లలం గాబట్టి మా బాగోగులు తెలుసుకోడానికి అప్పుడప్పుడు వస్తూంటారు' అని జవాబు చెప్పారని మా ఆవిడ ఓ రోజు చెప్పింది.

వాళ్ళలో మార్తా అనే అమ్మాయి నన్ను బాగా ఆకర్షించింది. వాళ్ళంతా క్రిష్టియన్స్ కాబట్టి వాళ్ల పేర్లు అలాగే వుంటాయి. మార్తాను చూసినప్పుడల్లా పలకరింపుగా నవ్వేవాడిని. తనూ బదులుగా నవ్వేది.

ఫ్లాట్స్ మేట్‌ని కాబట్టి నవ్వేదనుకుంటా. నేను మిగిలిన ముగ్గుర్ని పట్టించుకునేవాడిని కాదు. అందువల్ల నా అటెన్షన్ మార్తామీదే ఉందని ఆమెకి తెలియాలని నా ఉద్దేశ్యం.

ఉన్నట్టుండి, ఓ రోజు మా మామగారు బాల్చీ తన్నేశారు. మా ఆవిడ పుట్టింటికి వెళ్ళింది. నన్ను తొమ్మిదో రోజుకి రమ్మని చెప్పింది.

మా ఆవిడతో నేను సూట్‌కేసుతో వెళ్ళడం మార్తా చూసింది. మర్నాడు ఆమె లిఫ్ట్ దగ్గర నాకు తారసపడింది. ఎప్పటిలా నవ్వాను. ఆమే నవ్వింది. కొద్దిగా తటపటాయిస్తూ మొదటిసారిగా నాతో మాట్లాడింది.

"మీరు ఊరు వెళ్ళలేదా?"

"లేదు. మా ఆవిడ మాత్రమే వెళ్ళింది. మా మామగారు పోయారు. రెండు వారాలవుతుంది రావడానికి."

సరిగ్గా ఎనిమిది రోజుల తర్వాత ఓ రోజు ఉదయం తొమ్మిదికి నేను ఆఫీస్‌కి వెళ్ళడానికి తయారవుతూంటే నా ఫ్లాట్ బెల్ మోగింది. తలుపు తీస్తే ఎదురుగా మార్తా.

"రండి." చిరునవ్వుతో ఆహ్వానించాను.

అదే ఇంకెవరన్నా అయితే 'యస్.డి' అని నవ్వకుండా అనేవాడిని.

ఆమె లోపలికి రాకుండా చెప్పింది.

"మీకు నాతో గడపడానికి ఓ అరగంట సమయం ఉందా?"

"ఉంది."

ఆమె లోపలికి వచ్చింది.

"మీ బెడ్‌రూం ఎటు?" అడిగింది తలుపు మూస్తూ.

నేను బిత్తరపోయాను. చిన్నగా నవ్వి చెప్పింది.

"షాక్ అవకండి. మీ పలకరింపు నవ్వులకి బదులు తీర్చడానికి వచ్చాను."

నా అదృష్టాన్ని నేనే నమ్మలేక పోయాను. నాతో ఆమె ఓ గంటదాకా గడిపింది. తర్వాత వెళ్తుంటే అడిగాను.

"మళ్ళీ ఎప్పుడు?"

"ఇంక బదులు తీర్చడానికి ఏం మిగిలి లేదు."

వెళ్ళిపోయింది.

మళ్ళీ మార్తా వస్తుందని ఆ రోజంతా ఎదురు చూశాను. రాలేదు. మళ్ళీ ఎన్నడూ రాలేదు. కేవలం నా చిరునవ్వులకి బదులు తీర్చడానికే మార్తా వచ్చిందంటే నాకు నమ్మశక్యం కాలేదు.

ఆర్నెల్ల తర్వాత పెళ్ళి చేసుకున్న మార్తా తన భర్తతో ఆస్ట్రేలియాకి వలస వెళ్తూందని తెలిసింది నాకు. ఈలోగా ఎన్నిసార్లు మార్తాని రిక్వెస్ట్ చేసినా మళ్ళీ నాకు ఆ అవకాశం ఇవ్వలేదు.

ఆ రాత్రి ఫోన్ మోగింది. మార్తా కంఠం.

"నీకు అర్థం కాలేదు కదూ? నేను అంతకు మునుపు ఓ డజను మంది మగాళ్ళతో గడిపాను. నా కాబోయే భర్త పదమూడోవాడవడం నాకిష్టంలేక ఆ సంఖ్యకి నిన్ను ఎన్నుకున్నాను. పధ్నాలుగు నా భర్త. రేపు ఉదయం వెళ్ళిపోతున్నాం. గుడ్ బై."

"ఎవరండీ అది?" అడిగింది మా ఆవిడ నా మొహంలోని మార్పుని గమనించి.

"రాంగ్ నంబర్" చెప్పాను ఫోన్ పెట్టేస్తూ.

○ ○ ○

మార్తా నాకా సంగతి చెప్పకపోయినా బావుండేది. ఏడాది తిరక్కుండా నాకు వచ్చిన చికెన్ పాక్స్, బాత్‌రూంలో జారిపడి కాలు ఏంకిల్ దగ్గర ఫ్రాక్చరవడం, పరాయి రాష్ట్రానికి బదిలీ లాంటివి ఎన్నో నాకు జరిగాయి. ప్రతిసారీ మార్తాని కలవకపోతే బావుండేది అని నాకు అనిపిస్తూనే వుంది. ■